క్లుప్తంగా

ఉపాధి పనుల తనిఖీ



పనులను పరిశీలిస్తున్న ఏపీఓ

కోడుమూరు రూరల్: ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేయాలని ఏపీఓ మోదీన్‌బాషా సూచించారు. మంగళవారం మండలంలోని వర్కూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ తనిఖీ చేశారు. కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించారు. ఏపీఓ మాట్లాడుతూ.. కూలీలంతా నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజు వారి వేతనం రూ.272 వరకు పడుతుందన్నారు. గ్రామాల్లో పనులు అవసరమైన వారు సంప్రదిస్తే ఉపాధి పథకం కింద పనులు కల్పిస్తామని తెలిపారు. కాగా తమకు నాలుగైదు వారాల నుంచి వేతనాలు పడడం లేదని కూలీలు ఏపీఓ దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో పనులకు సంబంధించిన వేతనాలు కూలీల ఖాతాల్లో జమవుతాయని ఆయన తెలిపారు.

సంక్షేమ పథకాలపై అవగాహన



సంక్షేమ పథకాల క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

కోడుమూరు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాని కోడుమూరు ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని పులకుర్తి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని.. అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను బీజేపీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఓ రవిప్రకాష్, ఏఈలు గంగరాజు, ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా ఆడుదాం ఆంధ్రా పోటీలు



సి.బెళగల్లో ఆడుదాం ఆంధ్రాపై శిక్షణ ఇస్తున్న అధికారులు

సి.బెళగల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయులతో క్రీడా పోటీల నిర్వహణపై గ్రామ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడా నిబంధనలు, కోర్టుల కొలతలు, పోటీల నిర్వహణపై వలంటీర్లకు పీఈటీలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీడీలు వెంకటేశ్వర్లు, సుంకారావు, ఆయా పాఠశాలల పీఈటీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

కోడుమూరు రూరల్: వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై (ఈవీఎం) తహసీల్దార్ జయన్న బీఎల్వోలతో కలిసి మంగళవారం సాయంత్రం కోడుమూరులోని సంతమార్కెట్ ఆవరణలో ప్రజలకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి గ్రామంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ద్వారా ఓటు వేయడం వల్ల ఓటింగ్‌లో తప్పులకు తావుండదని, ప్రజలంతా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఓ రఘువీర్, బీల్వోలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల వంటావార్పు



గడివేములలో అంగన్‌వాడీ కార్యకర్తల వంటావార్పు

గడివేముల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం వంటావార్పు నిర్వహించారు. వేతనాలు పెంచాలని.. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. మెరిట్ ప్రకారం ప్రమోషన్లు కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వసంత లక్ష్మీ, రాములమ్మ, రామచెన్నమ్మ, పుష్ప, లలితమ్మ, లక్ష్మీదేవి, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేలు.. సమస్త సేవలు

- రైతు భరోసా కేంద్రాలతో అన్నదాతలకు భరోసా
- విత్తనం నుంచి విక్రయం వరకు సేవలు
- గ్రామాల్లోనే రైతులకు సలహాలు, సూచనలు
- వ్యవసాయాన్ని పండుగలా మార్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

గత టీడీపీ ప్రభుత్వంలో సాగు దండగలా మారింది. అప్పట్లో విత్తనాలు, రసాయన ఎరువులు, ఇన్‌పుట్ సిబ్సిడీ కోసం మండల కేంద్రాలకు రైతులు పరుగులు తియ్యాల్సి వచ్చేది. వ్యయ ప్రయాసలు తప్ప ఆశించిన ప్రయోజనం ఉండేది కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పుడమి పుత్రుల కష్టాలన్నీ తీరాయి. గ్రామ స్థాయిలోనే వ్యవసాయ అనుబంధరంగాలకు చెందిన సేవలన్నీ రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుతున్నాయి. తద్వారా వ్యవసాయం పండుగలా మారింది. ఆర్బీకేల ఏర్పాటుతో పాటు వైఎస్సార్ యంత్ర సాయం, సాగు రుణాలు, రైతు భరోసా వంటి పథకాలు అందుతున్నాయి.

గడివేముల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దూరదృష్టితో నెలకొల్పిన రైతు భరోసా కేంద్రాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. గడివేముల మండలంలో సాగు విస్తీర్ణం 32,300 ఎకరాలు కాగా చిన్న, సన్నకారు రైతులు దాదాపు 20 వేల మంది ఉన్నారు. వీరి కోసం మొత్తం 16 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలో రైతు భరోసా కేంద్రాల్లో రైతుల కోసం 2,690 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచారు. ఈ ఆర్బీకేల్లో వ్యవసాయ శాఖలకు సంబంధించిన సేవలే కాకుండా ఉద్యానశాఖ, ఏపీఎం ఐసీ, పశు సంవర్ధక, మత్స్య, పట్టు పరిశ్రమ, మార్కెటింగ్ శాఖల సేవలన్నీ గ్రామ స్థాయిలోనే అందుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



బిలకలగూడూరు ఆర్బీకే



బూజునూరు ఆర్బీకేలో కియోస్క్ మిషన్ ద్వారా ఎరువులను ఆర్డర్ చేసుకుంటున్న రైతులు

అన్ని సేవలు ఒకేచోట

వ్యవసాయంలో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించి ఉత్పాదకతను పెంచడం, ఇందుకు అవసరమైన అన్ని రకాల ఇన్‌పుట్స్ అంటే విత్తనం నుంచి పంట విక్రయాల వరకు ఆర్బీకేలు రైతులకు అండగా నిలుస్తున్నాయి. ఆర్బీకేల్లో వ్యవసాయ విజ్ఞానానికి సంబంధించి సుమారు 50 పుస్తకాలతో మినీ లైబ్రరీలు సైతం ఏర్పాటు చేశారు. అలాగే పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నారు. ఘన, ద్రవ జీవామృతం, కషాయాల తయారీ తదితర వాటిపై రైతులకు శిక్షణ ఇస్తున్నారు. డిజిటల్ కియోస్కుల ద్వారా అవసరమైన వాటిని ఆర్డర్ పెడితే ఇంటికే చేరుస్తున్నారు. గతంలో ప్రైవేట్ డీలర్లు రసాయన ఎరువులను అడ్డగోలుగా అధిక ధరలకు విక్రయించేవారు. ఆర్బీకేలు ఏర్పాటైన తరువాత వీరి అక్రమాలకు చెక్ పడింది. వ్యవసాయ సీజన్‌లో ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులను అందజేస్తున్నారు. పంటల సాగులో చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఆర్బీకేల వారీగా పొలంబడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

గడివేముల మండల వివరాలు..

సాగు విస్తీర్ణం:	32,300 ఎకరాలు
చిన్న, సన్నకారు రైతులు:	20 వేలు
రైతు భరోసా కేంద్రాలు:	16
అందుబాటులో ఉన్న ఎరువులు:	2,690 మెట్రిక్ టన్నులు
వ్యవసాయ పుస్తకాలు :	50 (ప్రతి ఆర్బీకేలో)



అందుబాటులో అన్ని సేవలు



గ్రామంలోనే ఆర్బీకేల ద్వారా అన్ని సేవలందుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పొందుతున్నాం. ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు అందుబాటులో ఉంచుతున్నారు. వ్యవసాయ సిబ్బంది వంట పొలంలోకి వచ్చి ఈ-క్రాప్ నమోదు చేస్తున్నారు. గతంలో ఎరువులు, విత్తనాల కోసం మండల కేంద్రానికి వెళ్లి క్యూలో నిలబడాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. చాలా సంతోషంగా ఉన్నాం. –గిత్త వెంకటేశ్వర్లు, రైతు, పెసరవాయి

రాయితీపై విత్తనాలు



వ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించిన సేవలు ఆర్బీకేల ద్వారా రైతుల ముంగిట్లోకే అందించే ఏర్పాటు చేశాం. రాయితీలతో విత్తనాలు కూడా అందిస్తున్నాం. కస్టమ్ హైరింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఆధునిక యంత్ర పరికరాలను అందుబాటులోకి తెచ్చాం. అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నాం.

–హేమసుందర్‌రెడ్డి, ఏఓ, గడివేముల

అక్రమ నిర్మాణాల కూల్చివేత

పాణ్యం: మండల పరిధిలోని జాతీయ రహదారి పక్కన అక్రమ నిర్మాణాలను ఎన్‌హెచ్ అధికారులు కూల్చివేశారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు, హైవే అధికారుల సమన్వయంతో అక్రంగా నిర్మాణాలను తొలగించారు. ఈ సందర్భంగా హైవే అధికారులు మాట్లాడుతూ బలపనూరు మెట్ట వద్ద సర్వీస్ రోడ్డుకు అడ్డంగా ఉన్న ఓ దుకాణాన్ని తొలగించాలని గతంతో పలుమార్లు చెప్పినా వినకపోవడంతో కూల్చి వేశామన్నారు. మెట్ట వద్ద కల్వర్టు నిర్మాణం జరగాల్సి ఉండగా ఈ నిర్మాణం అడ్డుగా ఉందన్నారు. అందుకే కూల్చివేసినట్లు చెప్పారు. పాణ్యం ఎస్ఐ అశోక్, హైవే అధికారులు నిరజ్‌కుమార్ గుప్తా, సుధాకర్‌రావు, కొండలరావు, రంజిత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



బలపనూరు మెట్ట వద్ద అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు

శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కల్లూరు: మండల పరిధిలోని ఎ.నాగలాపురం గ్రామంలో శ్మశానాన్ని ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.రామకృష్ణ కోరారు. మంగళవారం సీపీఎం మండల కార్యదర్శి కె.మధు, నాయకులు గ్రామంలో పర్యటించారు. ఎన్నో ఏళ్ల నుంచి ఎ.నాగలాపురం గ్రామంలో శ్మశానం ఉందన్నారు. అయితే దీని శ్మశానం పక్కనే ఉన్న రైతు ఈ స్థలం తనదే అంటూ కంచె వేయడం వల్ల సమస్యల నెలకొందన్నారు. అంత్యక్రియలు చేయడానికి కర్నూలు నగరానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులంతా కొన్నేళ్లుగా శ్మశాన వాటికగా ఉపయోగించుకున్న స్థలంలోనే దహన సంస్కారాలు జరిగేలా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. శ్మశాన వాటికకు అవసరమైన భూమిని కొనుగోలు చేయాలన్నారు.

యూటీఎఫ్ నేతకు నివాళి

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామంలో యూటీఎఫ్ సీనియర్ నేత, రిటైర్డ్ ఉపాధ్యాయుడు చెన్నకేశవరెడ్డి (80) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేఎస్ ప్రసాద్, ఎస్ వెంకటేశ్వర్లు మంగళవారం గ్రామానికి చేరుకుని ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెన్నకేశవరెడ్డి మృతి సంఘానికి తీరని లోటు అన్నారు ప్రస్తుత సంఘం సభ్యులు ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాడాలని, యూటీఎఫ్ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్, సి.బెళగల్, గూడూరు మండలాల యూనియన్ నేతలు ఉన్నారు.



చెన్న కేశవరెడ్డికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కేవీలో ఘనంగా క్రీడా దినోత్సవం



క్రీడాదినోత్సవాన్ని ప్రారంభిస్తున్న శంకర్‌శర్మ

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ క్రీడాజ్యోతిని ఆవిష్కరించి పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు జీవితంలో భాగం కావాలన్నారు. ప్రతిరోజు కొంత సమయాన్ని కేటాయించడం ద్వారా ఒత్తిడిని అధిగమించి చురుగ్గా చదువుల్లో రాణిస్తారన్నారు. అనంతరం ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, రన్నింగ్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ పాయల్ ప్రియదర్శిని, వ్యాయామ ఉపాధ్యాయులు బాదల్, స్పోర్ట్స్ కోచ్ వజ్రరాజు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక పాలనే ప్రభుత్వ లక్ష్యం

- అవినీతి, అక్రమాలను ప్రోత్సహించే ప్రసక్తే లేదు
- కాల్వబుగ్గలో అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- పూడిచెర్ల, కాల్వబుగ్గలో ముగిసిన గడప గడపకు మన ప్రభుత్వం



పూడిచెర్లలో సంక్షేమ క్యాలెండర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: పారదర్శక పాలనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని.. ఆ ఉద్దేశంతోనే సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల ముంగిటకే చేరవేస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పూడిచెర్ల, కాల్వ-2 సచివాలయాల పరిధిలో అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రజల యోగక్షేమాలు, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేశారు. పూడిచెర్లలో ఎమ్మెల్యేకు మహిళలు పూలవర్షం కురిపించి స్వాగతం పలికారు. పలు చోట్ల సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. మరికొన్ని చోట్ల రహదారి సమస్యను తీర్చాలని కోరారు. గ్రామంలో ఇంకా కొంత మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కరోనా సమయంలో రెండేళ్ల పాటు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడం అందరికీ తెలిసిన విషయమే అన్నారు. అలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో 90 శాతం నెరవేర్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. అర్హతను బట్టి ప్రతి కుటుంబానికి అమ్మ ఒడి, వృద్ధులు, వితంతువులకు వైఎస్సార్ పింఛన్ కానుక, మహిళలకు వైఎస్సార్ చేయూత, ఆసరా, సున్నావడ్డీ, రైతులకు రైతు భరోసా, పెళ్లి కానుక వంటి సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమచేయడం గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం లబ్ధిదారులకు సంక్షేమ పథకాల క్యాలెండర్లను పంపిణీ చేశారు.

టీడీపీ అసత్య ప్రచారాలను తిప్పికొట్టండి

రాష్ట్రంలో టీడీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తూనే, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న వైఎస్సార్‌సీపీని మరోసారి అధికారంలోకి తేవాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే ప్రజలకు మరింత ఆర్థిక చేయూత లభిస్తుందని పేర్కొన్నారు. గడప గడప కార్యక్రమం ద్వారా వచ్చే నిధులతో సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివనాగ ప్రసాద్, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పద్మనాభరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్ బాషా, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, సర్పంచ్ కె. పెద్ద వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మిదేవి, నాగిరెడ్డి, నాయకులు మహేశ్వరరెడ్డి, సోమశేఖర్‌నాయుడు, రాజన్న, చిన్న వెంకటేశ్వర్లు, భాస్కర్‌నాయుడు, ఎం. చంద్రశేఖర్ పాల్గొన్నారు.



కాల్వబుగ్గలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

కేసీకి 159 క్యూసెక్కుల నీటి విడుదల



సుంకేసుల రిజర్వాయర్

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు మంగళవారం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 1.194 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

క్రీస్తు మార్గం అనుసరణీయం

కల్లూరు: క్రీస్తు మార్గం అనుసరణీయమని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్ అన్నారు. మంగళవారం రాత్రి కల్లూరు అర్బన్ 32వ వార్డు గోవర్ధన్ నగర్‌లోని సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన క్యాండిల్ లైటింగ్ సర్వీస్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాస్టర్ క్రీస్తు పుట్టుక గురించి వివరించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని

కోడుమూరు - గూడూరు రోడ్డు నిర్మాణం చేపట్టండి

కర్నూలు(అర్బన్): ప్రజలకు పూర్తి ఇబ్బందికరంగా మారిన కోడుమూరు - గూడూరు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని బీజేపీ కోడుమూరు అసెంబ్లీ కో కన్వీనర్ వేల్పుల గోపాల్ కోరారు. మంగళవారం బీజేపీ నేతలు పీఆర్ ఎస్ఈ కే సుబ్రమణ్యంను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ రూ.6 కోట్లతో పీఎంజీఎస్‌వై కింద రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని, ఇప్పటికే టెండర్లు పిలిచామని ఆయన వివరించారు.

వారంతా 20 ఏళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తూ ఎప్పటికైనా తమ ఉద్యోగాలు పర్మినెంట్ కాకపోతాయా అని ఎదురు చూశారు. వారికి మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ మోసగిస్తూ పబ్బం గడిపారు గత సీఎం చంద్రబాబునాయుడు. జీఓ ఇచ్చి వారికి డీఏ, హెచ్‌ఆర్‌ఏ రాకుండా చేశారు. పాదయాత్రలో వారి బాధలు విన్న ప్రస్తుత సీఎం జగన్ ఇచ్చినట్లుగానే హామీ అమలు చేసి చూపించారు. వారి జీతాలు రూ.22 వేల నుంచి రూ.32 వేలకు పెరిగేలా చేసి వారి కళ్లలో ఆనందం నింపారు.

– కర్నూలు(హాస్పిటల్)



ఆనందమానందమాయె!

- కాంట్రాక్టు ఉద్యోగులకు వంద శాతం గ్రాస్ శాలరీ
- వైద్య ఆరోగ్యశాఖలో 200 మందికి లబ్ధి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో వివిధ కేడర్లలో 21 ఏళ్ల నుంచి కాంట్రాక్టు విధానంలో 200 మంది దాకా ఉద్యోగులు పనిచేస్తున్నారు. తమ ఉద్యోగాలు ఎప్పటికై నా రెగ్యులర్ కాకపోతాయా అని వారు ఎదురు చూస్తూనే ఉన్నారు. రాష్ట్ర విభజన అనంతరం జరిగిన ఎన్నికల్లో వారికి మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారు అప్పటి సీఎం చంద్రబాబునాయుడు. అధికారంలోకి వచ్చాక జీవో నెం.27 విడుదల చేసి కన్సాలిడేట్ పే ఇచ్చారు. దీని వల్ల పే డీఏ, హెచ్‌ఆర్‌ఏ రాకుండా అయిపోయింది. తమ సమస్యలపై వారు మళ్లీ పోరాటాలు చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో ఎన్నికల ముందు నిర్వహించిన పాదయాత్రలో కాంట్రాక్టు ఉద్యోగుల బాధలు విన్నారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. అధికారంలోకి వచ్చాక వారి హామీ నెలవెర్చే పనిలో పడ్డారు. ఈ క్రమంలోనే జీవో నెం.167 విడుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దీనిని గత సెప్టెంబర్ 14వ తేది నుంచి అమలయ్యేలా చేశారు. ఫలితంగా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వారి జీతాలు పెరుగుతున్నాయి. ఈ మేరకు వారి జీతాలు రూ.22 వేల నుంచి రూ.32 వేలకు పెరిగాయి. దీంతో పాటు పలువురి ఉద్యోగాలు సైతం రెగ్యులర్ అవుతున్నాయి.

ఎంతో ఆనందంగా ఉంది

నేను 21 ఏళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగంలో పనిచేస్తున్నాను. అధికారంలోకి వచ్చిన పాలకులంతా మాకు న్యాయం చేస్తామని చెప్పి అన్యాయం చేసి వెళ్లిపోయారు. మొదటిసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాకు న్యాయం చేశారు. గత ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నం.27ను రద్దు చేసి జీఓ నం.167 విడుదల చేసి మాలో ఆనందాన్ని నింపారు. దీనివల్ల మా జీతాలు రూ.22 వేల నుంచి రూ.32 వేలకు పెరిగాయి.

– ఎస్.నిర్మల, ఎంపీహెచ్ఏ(ఎఫ్), నందికొట్కూరు యూపీహెచ్‌సీ

పేడీఏ, హెచ్‌ఆర్ఏ అమల్లోకి వస్తున్నాయి

రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెం.27 రద్దు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నాం. దీనివల్ల మాకు పేడీఏ, హెచ్‌ఆర్ఏ రానున్నాయి. ఈ కారణంగా మా జీతాలు బాగా పెరుగుతున్నాయి. ఉద్యోగాలు సైతం రెగ్యులర్ కాబోతున్నాయి. ఇది కాంట్రాక్టు ఉద్యోగులందరికీ వర్తించేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ నిర్ణయం తీసుకున్న సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

–బి.మంగమ్మ, ఎంపీహెచ్ఏ(ఎఫ్), గూడూరు

జీవో నెం.27 రద్దు హర్షణీయం



కాంట్రాక్టు ఉద్యోగులపై గుదిబండగా మారిన జీఓ నం.27ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రద్దు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నాం. ఇది రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది కాంట్రాక్టు ఉద్యోగులకు ఆనందాన్నిచ్చే అంశం. దీనివల్ల 20 ఏళ్లుగా ఉద్యోగాలను నమ్ముకుని ఉన్న మాలాంటి కాంట్రాక్టు ఉద్యోగులకు జీతాలు పెరిగాయి. ఇది ఎంతో సంతోషించదగ్గ అంశం. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– బి.రఘుబాబు, ఏపీ జీఈఎఫ్ జిల్లా చైర్మన్, కర్నూలు

ఘనంగా క్రీడా దినోత్సవం



క్రీడాదినోత్సవాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ క్రీడాజ్యోతిని ఆవిష్కరించి పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు జీవితంలో భాగం కావాలన్నారు. ప్రతిరోజు కొంత సమయాన్ని కేటాయించడం ద్వారా ఒత్తిడిని అధిగమించి చురుగ్గా చదువుల్లో రాణిస్తారన్నారు. అనంతరం ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, రన్నింగ్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ పాయల్ ప్రియదర్శిని, వ్యాయామ ఉపాధ్యాయులు బాదల్ పాల్గొన్నారు.